సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025

బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



ఒక్కేసి పువ్వేసి చందమామ

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సిద్దిపేటరూరల్: జిల్లా అధికార యంత్రాంగం కలెక్టరేట్‌లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కె.హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి మహిళల ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. ప్రపంచంలోనే పువ్వులను పూజించే ఏకైక పండగ బతుకమ్మ పండగ అని కలెక్టర్ చెప్పారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ ఎప్పుడు ఆఫీస్ పనులతో బిజీగా ఉండే ఉద్యోగస్తుఉ సాంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పండుగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కాగా, బతుకమ్మ పండుగ విశిష్టతపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో బహుమతులు సాధించిన ఇ.సాయి సంతోషి, డి.సృజన, జి.మనస్వినిలకు, షార్ట్ ఫిలిం కాంపిటీషన్ విజేత గిరిబాబులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మలకు హారతి పడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్


వివిధ శాఖలు తయారు చేసిన బతుకమ్మలు


వినూత్న ఆకారంలో బతుకమ్మ

న్యూస్‌రీల్

సిద్దిపేట సీపీగా విజయ్‌కుమార్



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ బదిలీ అయ్యారు. నూతన పోలీసు కమిషనర్‌గా ఎస్ఎమ్ విజయ్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ సిటీ వెస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను సిద్దిపేట నూతన సీపీగా నియమిస్తూ, ఇప్పటి వరకు సిద్దిపేట సీపీగా కొనసాగిన అనురాధను ఎల్‌బీ నగర్ డీసీపీగా నియమించారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని శ్రీ దేవి నవరాత్రోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొలిపిన దుర్గా మాతను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావనతో పాటు సామాజిక సేవను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు సూకూరి లింగం, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ కో అప్షన్ మెంబర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ భైరయ్యపాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి నివాళి


కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

సిద్దిపేటకమాన్/ ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని సిద్దిపేటలో బాపూజీ విగ్రహానికి కలెక్టర్ హైమావతి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, తదితరులు పాల్గొన్నారు. అలాగే.. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ పాల్గొన్నారు.

బాపూజీ బాటలో ముందుకు సాగాలి: ప్రొఫెసర్ కోదండరాం

ములుగు(గజ్వేల్): కొండా లక్ష్మణ్ బాపూజీ అంకిత భావం స్ఫూర్తిగా సమాజ సేవకు యువత నడుం బిగించాలని ప్రొఫెసర్ ఎం.కోదండరాం పిలుపు నిచ్చారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన ఆచార్య లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ బాపూజీ జీవితం, రాజకీయ చరిత్ర నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, ఉద్యాన వర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్.దండా రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

- మహిళలకు 50 శాతం కోటా
- పార్టీ నేతల ఎదుట డ్రా
- నేడో రేపో ఎన్నికల షెడ్యూల్!

జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు



సాక్షి, సిద్దిపేట: స్థానిక సంస్థల రిజర్వేషన్ల ఉత్కంఠకు తెర పడింది. జిల్లాలోని సర్పంచ్‌లు 508, ఎంపీటీసీలు 230, వార్డు సభ్యులు 4,508, జెడ్పీటీసీలు 26లకు రిజర్వేషన్లను జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. శనివారం జెడ్పీటీసీ, ఎంపీపీలకు సంబంధించిన రిజర్వేషన్లను కలెక్టరేట్‌లో, సర్పంచ్, ఎంపీటీసీల రిజర్వేషన్లు ఎంపీడీఓ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఎదుట 50శాతం మహిళలకు సంబంధించిన డ్రాను తీశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినప్పటి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీల రిజర్వేషన్లు ఏమి ఉండబోతున్నాయో అని ఆశావహుల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

బీసీలకు 11 జెడ్పీటీసీలు

జిల్లా వ్యాప్తంగా 26 జెడ్పీటీసీలు, ఎంపీపీలుండగా అందులో 11 బీసీలు, ఎస్సీలకు 5, అన్ రిజర్వ్ 9, ఎస్టీలకు ఒకటి కేటాయించారు. జనరల్‌కు 15, మహిళలకు 11 కేటాయించారు. జెడ్పీటీసీ, ఎంపీపీలు అన్ రిజర్వ్‌కు 9 కేటాయించగా జనరల్‌కు 5, మహిళలకు 4, బీసీలకు 11 కేటాయించగా జనరల్‌కు 6, మహిళలకు 5, ఎస్సీలకు ఐదు కేటాయించగా జనరల్ 3, మహిళలకు 2, ఎస్టీ జనరల్‌కు కేటాయించారు.

జెడ్పీ చైర్మన్ బీసీ జనరల్

సిద్దిపేట జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్ బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో 11 మండలాల్లో గెలిచే జెడ్పీటీసీలలో ఒక్కరికి చైర్మన్ దక్కే అవకాశం ఉండనుంది.

పలువురికి నిరాశ

రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో పలువురు రాజకీయ నాయకులు నిరాశ చెందారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకున్న ఆశావహులకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో అంతా సిద్ధం చేసుకున్నారు. పలువురు ఆశావహులకు రిజర్వేషన్లు కలిసిరాకపోవడంతో డైలామలో పడ్డారు. గత ఏడాది కాలంగా క్షేత్రస్థాయిలో పట్టుసాధించుకున్న నేతలు.. రిజర్వేషన్లు తారుమారు కావడంతో తలలు పట్టుకుంటున్నారు. అలాగే కొన్ని మండలాల్లో కొత్త లీడర్లు, వ్యాపారస్తులు వచ్చే అవకాశం ఉంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ రావడమే మిగిలి ఉంది. నేడో రేపో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు

మండలం పేరు	జెడ్పీటీసీ	ఎంపీపీ
అక్బర్‌పేట-భూంపల్లి	ఎస్సీ (జనరల్)	ఎస్సీ (మహిళ)
అక్కన్నపేట	జనరల్	అన్ రిజర్వ్(మహిళ)
బెజ్జంకి	జనరల్	అన్ రిజర్వ్(మహిళ)
చేర్యాల	ఎస్సీ(మహిళ)	ఎస్సీ (మహిళ)
చిన్నకోడూరు	బీసీ(జనరల్)	బీసీ(మహిళ)
దూళ్మిట్ట	ఎస్టీ(జనరల్)	ఎస్టీ(జనరల్)
దౌల్తాబాద్	బీసీ(మహిళ)	బీసీ(జనరల్)
దుబ్బాక	ఎస్సీ(జనరల్)	ఎస్సీ(జనరల్)
గజ్వేల్	అన్ రిజర్వ్(మహిళ)	జనరల్
హుస్నాబాద్	అన్ రిజర్వ్(మహిళ)	జనరల్
జగదేవ్‌పూర్	బీసీ(మహిళ)	బీసీ(ఉమెన్)
కోహెడ	బీసీ(జనరల్)	బీసీ(జనరల్)
కొమురవెల్లి	బీసీ(మహిళ)	బీసీ(జనరల్)
కొండపాక	జనరల్	జనరల్
కుకునూరుపల్లి	ఎస్సీ(మహిళ)	ఎస్సీ(జనరల్)
మద్దూరు	బీసీ(మహిళ)	బీసీ(మహిళ)
మర్కూక్	జనరల్	అన్ రిజర్వ్(మహిళ)
మిరుదొడ్డి	బీసీ(జనరల్)	బీసీ(మహిళ)
ములుగు	జనరల్	జనరల్
నంగునూరు	బీసీ(జనరల్)	బీసీ(జనరల్)
నారాయణరావుపేట	బీసీ(జనరల్)	బీసీ(మహిళ)
రాయపోలు	అన్ రిజర్వ్(మహిళ)	అన్ రిజర్వ్(మహిళ)
సిద్దిపేట రూరల్	ఎస్సీ (జనరల్)	ఎస్సీ(జనరల్)
సిద్దిపేట అర్బన్	బీసీ(జనరల్)	బీసీ(జనరల్)
తొగుట	బీసీ(మహిళ)	బీసీ(జనరల్)
వర్గల్	అన్ రిజర్వ్(మహిళ)	అన్ రిజర్వ్(జనరల్)

ఆయిల్‌పామ్ హబ్‌గా సిద్దిపేట

గణనీయంగా పెరుగుతున్న సాగు

- అందుబాటులోకి నర్మెట ఫ్యాక్టరీ
- రూ.300 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ప్రస్తుతం క్రషింగ్ ట్రయల్ రన్


ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సువర్ణ, ఇతర అధికారులు

గజ్వేల్: ఆయిల్‌పామ్ సాగుకు సిద్దిపేట జిల్లా హబ్‌గా మారబోతుంది. తెలంగాణలో ఐదేళ్ల క్రితం కొత్తగా ప్రారంభమైన సాగును క్రమంగా విస్తరించుకుంటూ సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు కేంద్రం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఆయిల్‌పామ్(ఎస్ఎంఈఓ) పథకంలో భాగంగా నాలుగేళ్లల్లో తెలంగాణ 1,25,300 హెక్టార్ల సాగు లక్ష్యానికి తెలంగాణ ఇప్పటివరకు 78,869 హెక్టార్లకుపైగా లక్ష్యాన్ని సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఇదే క్రమంలో రాష్ట్రంలో సాగు పెరుగుతూ వస్తున్న జిల్లాల్లో సిద్దిపేట తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నది. గడిచిన ఐదేళ్లల్లో ఇక్కడ 12,350 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చింది. జిల్లాలోని నర్మెటలో మాజీ మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగా రూ.300 కోట్ల వ్యయంతో ప్రారంభమైన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తికాగా, ప్రస్తుతం క్రషింగ్‌ను ట్రయల్ చేస్తున్నారు. దీని కారణంగా రాబోవు రోజుల్లో జిల్లాలో ఆయిల్‌పామ్ మరింతగా పెరగనున్నది. నర్మెటలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ ఆయిల్‌పామ్ సాగు సమీప జిల్లాలో విస్తరించడానికి అడుగులు పడ్డాయి. ఇంతకాలం మార్కెటింగ్ సౌకర్యాలు సక్రమంగా లేక, సాగుకు వెనుకంజ వేసిన రైతులు ఆయిల్‌పామ్ సాగును పెంచుకునే అవకాశం కలిగింది. జిల్లాలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో నిత్యం 30 టన్నుల క్రషింగ్ సామర్థ్యం కలిగివున్నది. ఎక్కడాలేని విధంగా రిఫైనరీ, ప్యాకింగ్‌కు అవకాశమున్నది. ఇక్కడి నుంచి ప్యాకింగ్ ఉత్పత్తులు నేరుగా మార్కెట్‌లోకి వెళ్లనున్నాయి. ఇందుకు సంబంధించి యంత్ర సామగ్రి ఇప్పటికే అమర్చారు. ఈ అంశంపై సిద్దిపేట జిల్లా ఉద్యానవనశాఖాధికారి సువర్ణ 'సాక్షి'తో మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి హబ్‌గా మారే అవకాశమున్నదని చెప్పారు. జిల్లాలోని రైతులకు ఈ సాగు కొత్తయినా, ఏటా ఈ పంటను సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతూ వస్తున్నదని, ఇది శుభ పరిణామమని పేర్కొన్నారు.

చీఫ్‌జస్టిస్‌ను అవమానించడం తగదు

ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని అవమానపర్చడం సరికాదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సిద్దిపేట ఎస్సీ ఎస్టీ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళితుడైన చీఫ్ జస్టిస్ గవాయిని శునకం అంటూ అవమానపర్చిన న్యాయవాదులకు శిక్షలు తప్పవని, ఆ దిశగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చర్యలు చేపడుతుందన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులు

- కలెక్టర్ హైమావతి
- అధునాతన సాంకేతిక కేంద్రం ప్రారంభం


కుకునూరుపల్లి ఐటీఐలో చెక్క బొమ్మలను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో అధునాతన సాంకేతిక కేంద్ర (ఏటీసీ) బోధన తీరులను శనివారం కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే విజయం సాధిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలన్నారు. మారుతున్న కాలంతో సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని చెప్పారు. ఐటీఐలో కొత్త కోర్సులను చేర్చి శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ఉపాధి అందించేలా చర్యలు చేపట్టామన్నారు. కాగా, విద్యార్థులు చెక్కపై మిషన్‌తో బొమ్మలు తయారు చేసిన తీరులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ రమణ పాల్గొన్నారు.

వైద్యం చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దు

స్వస్తినారి సశక్త్ పరివార్ అభియాన్‌లో వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించి వైద్యం అందుతున్న తీరులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్టోబరు 2 వరకు స్వస్తినారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్య సేవలందిస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు 85 మందికి పైగా మహిళలకు వైద్యం అందించామంటూ వైద్యులు శ్రీధర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ధాన్యం కొనుగోలుకు సమగ్ర ప్రణాళిక

- జిల్లా లక్ష్యం 5.03లక్షల మెట్రిక్ టన్నులు
- రైతులకు ఇబ్బందులు కలుగొద్దు
- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హమీద్

సిద్దిపేటజోన్: వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికలతో యంత్రాంగం ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. వరి ధాన్యం కొనుగోళ్లు-మద్దతు ధర తదితర అంశాలపై శనివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో వానాకాలం 2025-26 కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం తెచ్చిన రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3,29 లక్షల ఎకరాల్లో వరి సాగు అయిందని, మొత్తంగా 8.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయ్యే అవకాశం ఉందన్నారు. ఇందులో రైతుల అవసరాలు, ఇతరత్రా బహిరంగ కొనుగోళ్లకు పోను 5.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో సన్న, దొడ్డు ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ గ్రేడ్ రకం మద్దతు ధర క్వింటాలుకు రూ 2,389, సాధారణ రకం క్వింటాలుకు రూ 2,369 ప్రభుత్వం ధర నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 439 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ప్యాడి క్లీనర్, వేయింగ్ స్కెల్, తేమ పరీక్ష మిషన్, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో పెద్ద కొనుగోలు కేంద్రాలకు ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్లను ఇస్తామన్నారు. ప్రభుత్వ బోనస్ రూ 500అదనంగా చెల్లింపు ఉంటుందన్నారు. నిర్దేశించిన లక్ష్యం ధాన్యం సేకరణకు అవసరమైన గన్ని బ్యాగ్‌లను సమకూర్చుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా హమాలీలు ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ తనూజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డీఎం సివిల్ సప్లై,, ఆయా మండల వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జలసవ్వడి

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నంగునూరు మండలం అన్ని గ్రామాల్లో చెరువులు మత్తడి దూకుతున్నాయి. మండలం గుండా ప్రవహించే మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుపై నిర్మించిన తొమ్మిది చెక్‌డ్యామ్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఘణపూర్ నుంచి నంగునూరు, అక్కేనపల్లి నుంచి బస్వాపూర్ మధ్యలో నిర్మించిన చెక్‌డ్యామ్ కాజ్‌వే నుంచి ప్రమాదకరంగా నీరు ప్రవహిస్తుడడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి.

– నంగునూరు(సిద్దిపేట)


మత్తడి దూకుతున్న చెక్‌డ్యామ్

క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలకు హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి దూకుతోంది. వరదలకు చెరువు నిండుకుండలా పొంగిపొర్లుతోంది. మత్తడి ఉధృతంతో హుస్నాబాద్ నుంచి మాలపల్లె గ్రామానికి వెళ్లే రహదారిపై మోకాళ్ల లోతు వరకు నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మత్తడి అందాలను చూసేందుకు పట్టణ ప్రజలు తరలి వచ్చి సందడి చేశారు.

– హుస్నాబాద్


ఎల్లమ్మ చెరువు మత్తడి ప్రవాహం

క్లుప్తంగా

దాబా సీజ్

నిజాంపేట(మెదక్): అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాబాను సీజ్ చేశారు. వివరాలు ఇలా... శనివారం మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలోని వెంకట్ గౌడ్‌కు చెందిన భవానీ దాబాలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో ఆర్డీఓ ఉత్తర్వుల మేరకు దాబా యజమానికి నోటీసులు అందజేసి సీజ్ చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు స్క్వాడ్, నార్కోటిక్ బృందాలు

కొల్చారం(నర్సాపూర్): మాదక ద్రవ్యాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం డ్రగ్స్, గంజాయిని నివారించేందుకు మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో గల హోటళ్లు, దుకాణాలు, రెస్టారెంట్లలో బాంబు స్క్వాడ్, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. మండలానికి చేరుకున్న ఆ బృందాలు స్థానిక పోలీసులతో కలిసి తనిఖీల్లో పాల్గొన్నాయి.

లంచం అడిగిన కార్యదర్శి సస్పెన్షన్

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుడ్ని లంచం డిమాండ్ చేసినందుకు పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. నిజాంపేట్ మండలం ఈదుత్ తండాకు చెందిన ఆంగోత్ తులసీ బాయి బేస్మెంట్ వరకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంది. నిర్మాణానికి సంబంధించిన ఫొటో క్యాప్చర్ కోసం కార్యదర్శి రూ.5వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు బాధితురాలు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయగా.. పీడీ చలపతిరావు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. పీడీ నివేదిక ఆధారంగా కలెక్టర్ కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

ఫోర్జరీ కేసులో రెండేళ్ల జైలు

జోగిపేట (అందోల్) : దొంగ సంతకాలతో (ఫోర్జరీ) రిజిస్ట్రేషన్ చేసినందుకు నలుగురికి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. జోగిపేట ఎస్‌ఐ పాండు వివరాల ప్రకారం... శంకరంపేట మండలం మడిశెట్టి పల్లి గ్రామానికి చెందిన పుష్పవతికి పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. 2008లో రాణి అనే మహిళను పుష్పవతిగా చిత్రీకరించి సులోచన కొన్నట్లుగా రిజిస్ట్రేషన్ చేశారు. కాగా పీపీ స్వాతి గౌడ్ కోర్టులో వాదనలు వినిపించారు. ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసిన రాణి, సులోచనలకు, ఇందులో సాక్ష్యులుగా ఉన్న పెంటయ్య, సుమిత్రలకు జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి స్వాధీనం

జిన్నారం (పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని ఓఆర్‌ఆర్ వద్ద శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన పూర్ణచంద్ర భరిమాల్ ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా అతని వద్ద 90 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని విచారించారు. తనకు గంజాయి తీసుకునే అలవాటు ఉందని, తాను నివాసముండే గది పక్కన ఓ మూతబడిన పరిశ్రమలో విత్తనాలు వేసి గంజాయి పండిస్తానని తెలిపాడు. అలా పెరిగిన చెట్టు ఆకులను ఎండపెట్టి దానిని విక్రయిస్తానని వెల్లడించారు. కాగా నిందితుడి నుండి 19 గంజాయి మొక్కలు, పల్సర్ బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

చరిత్రకు సాక్ష్యాలు

ఆదిమానవుల నేల... శిలా శాసనాల ఖిల్లా గజ్వేల్

- వర్గల్ శంభుని గుట్టపై చిహ్నాలు
- గుట్ట పరిసరాల్లో రాక్షస గూళ్లు
- మానవ పరిణామ క్రమానికి గీటురాయి

యుగాలు, తరాలు మారినా, శాస్త్ర సాంకేతిక పురోగతి రాకెట్ వేగంతో దూసుకెళుతున్నా.. ఆనాటి మానవుని మనోభావాలు, శిలా శాసనాలు ఏదో రూపంలో బయటపడుతూనే ఉన్నాయి. ఇలాంటి విశేషాలకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతం నిలయంగా మారుతోంది. ఈ ఆధారాలు మానవ వికాస పరిణామక్రమానికి ఎల్లలు లేవనే విషయాన్ని చాటి చెబుతున్నాయి. గజ్వేల్ ప్రాంతంలోని ఆదిమానవుల చారిత్రక విశేషాలు, శిలాశాసనాల ప్రత్యేకతలపై ఈ వారం కథనం. – గజ్వేల్ / వర్గల్(గజ్వేల్) :



వర్గల్ సరస్వతి ఆలయంతో కూడిన శంభుని కొండ

సండే స్పెషల్

గజ్వేల్ నియోజకవర్గంలో రెండో బాసరగా విశేష ఆదరణ కలిగిన చదువుల తల్లి కొలువుదీరిన వర్గల్ శంభుని కొండ గుహలు, నాడు ఆదిమానవుల నెలవులుగా విలసిల్లిన ఆనవాళ్లు ఉన్నాయి. వర్గల్ గ్రామానికి ఆగ్నేయ దిశలో ఎత్తైన కొండల శిఖరాగ్రాన శ్రీవిద్యాసరస్వతి అమ్మవారి సన్నిధానం ఎడమ పక్కన పెద్ద బండరాయి ఉన్నది. ఈ రాయి అడుగున ఎరుపు రంగులో అర్థం కాని భాషలో నాడు ఇక్కడ ఆవాసమున్న ఆదిమానవులు లిఖించినట్లు చెప్పబడుతున్న అక్షరాలు నేటికీ కనిపిస్తున్నాయి.

గుట్ట పరిసరాల్లో 'రాక్షసగూళ్లు'

శంభుని కొండ పరిసరాల్లో బృహత్ శిలాయుగపు నాటి ఆది మానవుల సమాధులుగా చెప్పుకునే 'రాక్షస గూళ్లు' పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మధ్యన సమాధి.. దాని చుట్టూ గుండ్రంగా, వృత్తాకారంలో పెద్ద పెద్ద బండలతో పేర్చినట్లు కనిపిస్తాయి. వర్గల్‌కు నైరుతి దిశలో అటవీ ప్రాంతంతో కూడిన తున్కిఖాల్సా గ్రామ సమీపంలో పెద్ద సంఖ్యలో 'రాక్షస గూళ్లు' నాటి చరిత్రకు అద్దం పడుతున్నాయి.

వర్గల్ మండలంలో రాజుల నాటి శాసనాలు కూడా ఉన్నాయి. వర్గల్‌లో మూల స్థాన ఆలయానికి క్రీస్తు శకం 970లో కొంత భూమిని అప్పటి రాజులు దానంగా ఇస్తున్నట్లు పేర్కొంటూ కన్నడ భాషలో దాన శిలా శాసనం చెక్కించారు. అలాగే సీతారాంపల్లిలో క్రీస్తు శకం 979 నాటి శిలాశాసనం ఉన్నది.


పలు గ్రామాల్లో శిలా శాసనాలు

దాదాపు 5 ఫీట్ల ఎత్తున్న శిలపై నాలుగు దిక్కులా కన్నడ భాషలో అక్షరాలు చెక్కించారు. వేలూరు గ్రామ పటేల్ చెరువు పూడిక తీత పనుల్లో బయటపడిన దీనిని గ్రామ కూడలిలో స్థాపించారు.

- గజ్వేల్ ప్రాంతంలోని కొండపాక రుద్రేశ్వరాలయ ప్రతిష్ట, ఆలయ నిర్వహణకు భూ దానం అంశాన్ని వివరిస్తూ నాడు కాకతీయ రుద్రదేవుడి కాలంలో క్రీ.శ.1194 వేయించిన శాసనమున్నది.
- అలాగే ఐతేశ్వర సోమనాథ ఆలయానికి సంబంధించి ఒకే శిలపై కాకతీయ గణపతిదేవ చక్రవర్తి కాలం నాటి రెండు శాసనాలున్నాయి.
- మర్కూక్ మండలం పాములపర్తి పటేల్‌చెరువు వద్ద క్రీ.శ.1148 నాటి దానశాసనంను గుర్తించారు. అదేవిధంగా ఇటిక్యాలలో మూడు పక్కల తెలుగు, ఒక వైపు సంస్కృత శ్లోకంతో కూడిన శాసనం కనపడుతుంది.



వర్గల్ గుట్ట పరిసరాల్లో రాక్షసగూళ్లు



ఆదిమానవులు వేసిన జంతువుల బొమ్మలు



సీతారాంపల్లిలో క్రీ.శ. 979 నాటి శిలాశాసనం

చారిత్రక సంపదను సంరక్షించుకోవాలి



పురాతన శాసనాలకు, చారిత్రక సంపదకు గజ్వేల్ నియోజకవర్గం నెలవు. అందుకు సంబంధించి అనేక ఆనవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇక్కడి ప్రాచీన చారిత్రక, పురాతత్వ, శిల్ప కళాసంపదలు కాలగర్భంలో కలిసిపోకముందే పరిరక్షించి భావితరాలకు అందజేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

– డాక్టర్ హరినాథ్‌శర్మ, రిటైర్డ్ ప్రభుత్వ తెలుగు శాఖాధిపతి

చేర్యాల పట్టణం.. జలమయం

- వరద నీటిలో కడవేర్గు రోడ్డు
- శుభోదయనగర్‌లో ఇళ్లలోకి వరద
- చర్యలు తీసుకోవాలని స్థానికుల ధర్నా

చేర్యాల(సిద్దిపేట): రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పెద్ద చెరువు నిండి మత్తడి దూకడంతో వరద నీరు పట్టణంలోని ఇండ్లలోకి చేరింది. దీంతో కడవేర్గు రోడ్డు ప్రాంతం అంతా జలమయంగా మారింది. ప్రధానంగా పెద్ద చెరువు మత్తడి నీరు శుభోదయనగర్ ప్రాంతం గుండా కుడి చెరువులోకి చేరాల్సి ఉంది. కానీ వరదనీటికి అడ్డంగా నిర్మాణాలు చేయడంతో నీరు ఇండ్లలోకి చేరింది. గాంధీ చౌక్ ప్రాంతంలో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రెండు వైపులా నీరు నిలిచి ప్రధాన రహదారిపై వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దిలీప్ నాయక్, సీఐ ఎల్.శ్రీను, ఎస్‌ఐ నవీన్ జేసీబీ సహాయంతో గాంధీ చౌక్, కడవేర్గు వెళ్లే రోడ్డు ప్రాంతంలో వరద నీటిని కుడి చెరువులోకి మళ్లించారు. దీంతో వాహన రాకపోకలకు కొంత సులువైంది. కానీ ప్రజలు అధికారుల తీరును నిరసిస్తూ తమ ఇండ్లల్లోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వారితో తహసీల్దార్, సీఐలు మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం శుభోదయనగర్ ప్రాంతాన్ని పరిశీలించారు.



జేసీబీ సహాయంతో వరద నీటిని మళ్లిస్తున్న సీఐ శ్రీను, తదితరులు



శుభోదయనగర్ ప్రాంతంలో ఇండ్ల మధ్యలో నిలిచిన వరద నీరు

గౌరమ్మా.. పోయిరావమ్మా

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణలో ప్రత్యేకమైన పండుగ అంటే అది బతుకమ్మనే. తొమ్మిది రోజుల పాటు ఆనందంగా జరుపుకునే పండుగ. పోయిరా గౌరమ్మ పోయిరావమ్మా అంటూ చిన్నకోడూరు మండలంలోని ఆరు గ్రామాల్లో శనివారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ పండుగ ఇందుకు భిన్నంగా ఇక్కడి సంప్రదాయం ప్రకారం ఏడు రోజుల్లోనే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తారు. మండలంలోని చిన్నకోడూరు, మెట్‌పల్లి, మాచాపూర్, కమ్మర్లపల్లి, చెలుకలపల్లి, అల్లీపూర్ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.



మాచాపూర్‌లో బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు సతీమణి శ్రీనిత



చిన్నకోడూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేడుకల్లో మాజీ మంత్రి సతీమణి

మాచాపూర్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, మున్సిపల్ చైర్మన్ మంజుల, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఏఎంసీ చైర్మన్‌లు విజిత, వనతి, మాజీ సర్పంచ్ అరుణ రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

శాస్త్రీయ పద్ధతిలో భూసేకరణ చేపట్టాలి



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గజ్వేల్‌రూరల్: శాస్త్రీయ పద్ధతిలో రింగురోడ్డు భూసేకరణ చేపట్టి రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ డీటీ భాగ్యరేఖకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, మర్కుక్, గజ్వేల్, వర్గల్, రాయపోల్ మండలాల పరిధిలో 20 గ్రామాల మీదుగా త్రిపుల్ ఆర్ వెళ్తుందన్నారు. ఇందులో సుమారు 980 ఎకరాల భూమి రింగురోడ్డుకు అవసరమున్నట్లు సర్వే చేశారని తెలిపారు. భూమిని కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిచో బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి 250 గజాల స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, భూబాధితులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో, గ్రేవ్ కేసుల్లో వేగంగా ఇన్వేస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోక్సో కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. అవసరమైతే న్యాయమూర్తులను స్వయంగా కలవడం ద్వారా కేసుల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కాగా మెదక్‌లోని ఎస్‌బీఐలో దొంగతనం చేయడానికి ప్రయత్నించిన నిందితులను త్వరితగతిన పట్టుకొని రిమాండ్‌కు తరలించడంపై పోలీసుల అధికారులను ఎస్పీ అభినందించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- దుబ్బాకలో ఏటీసీ ప్రారంభం

దుబ్బాక : విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకొని భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఉపాధి మరియు శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏటీసీతో ఆధునిక యంత్రాలు , డిజిటల్ నైపుణ్యాలు, ఇండస్ట్రియల్ టెక్నాలజీ, ఆటోమేషన్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో ట్రైనింగ్ పొందే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు టెన్త్, ఇంటర్ పూర్తిచేశాక ఏటీసీలో కోర్సులు నేర్చుకొని అనేక కంపెనీల్లో ఉద్యోగాలు లేదా స్వతహాగా కంపెనీలు పెట్టుకొని ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు.



దుబ్బాకలో ఏటీసీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పండుగ పూట విషాదం

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): పండుగ పూట వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలు ఇలా...చిన్నకోడూరు గ్రామానికి చెందిన కొలను శంకర్(45) శనివారం సాయంత్రం గ్రామంలో ఇంట్లో సద్దుల బతుకమ్మను పేర్చి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లారు. శేరుపల్లి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో పడిపోయి ఉన్నాడు. సమీప రైతులతో కలిసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య కనకవ్వ, కుమారుడు ఉన్నారు.

పొలం పనులు ముగించుకుని వస్తుండగా...

లారీ ఢీకొని రైతు మృతి

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హబ్షిపూర్ వద్ద సిద్దిపేట–రామాయంపేట రహదారిపై జరిగింది. గ్రామస్తుల వివరాలు... రైతు బొంగురం మల్లారెడ్డి(42)తన వ్యవసాయ పొలం వద్ద పనులు ముగించుకుని సాయంత్రం తన పాడి గేదెను తోలుకుని ఇంటికి వస్తున్నాడు. ఇదే క్రమంలో రామాయంపేట వైపు నుంచి సిద్దిపేట వైపు అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు ఆగ్రహంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



మల్లారెడ్డి

ఆల్ప్రాజోలం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

గజ్వేల్‌రూరల్: మత్తు పదార్థాలతో కల్లును తయారు చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కేసు వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో మర్కుక్ మండలం పాములపర్తికి చెందిన టీ.లక్ష్మణ్‌గౌడ్, తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన ఎం.నర్సింలుగౌడ్, నార్సింగికి చెందిన జీ.శ్రీకాంత్‌గౌడ్, కాచాపూర్‌కు చెందిన పీ.సాయికుమార్‌గౌడ్ కలిసి కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు కొన్ని రోజులుగా ఆల్ప్రాజోలం, ఇతర మత్తు పదార్థాలను కల్లులో కలిపి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులతో కలిసి రైడ్ చేశారు. దాడిలో రూ. 84వేల విలువ చేసే 210 గ్రాముల ఆల్ప్రాజోలమ్‌తో పాటు గ్మాల మిక్స్, మిక్స్ పౌడర్, వైట్‌పౌడర్, కట్ట, సచరిన్, సోడాతో పాటు 3 సెల్‌ఫోన్‌లు, కారును స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మణ్‌గౌడ్, నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించగా, సాయికుమార్‌గౌడ్ పరారీలో ఉన్నాడు. ఎస్‌ఐలు ప్రేమ్‌దీప్, రఘుపతి, టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీస్ సిబ్బంది స్వామి, వెంకటేశ్, రవీందర్, వెంకన్న, నరేందర్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అదనపు సీఐ

బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న కళాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తిరుమల తిరుపతి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన హిమగిరి కళాకారులు శనివారం నృత్య ప్రదర్శన చేసి అలరించినట్లు, హిమగిరి నృత్య శిక్షణ సంస్థ నిర్వాహకులు సుజన యాదవ్, గిరి తెలిపారు. అకాడమీకు చెందిన 21 మంది యువ కళాకారులు ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుందన్నారు. భారతీయ సంప్రదాయ నృత్య వైభవాన్ని ప్రతిబింబించే ఈ నృత్యాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయని పేర్కొన్నారు.



నృత్య ప్రదర్శన చేసిన సిద్దిపేట హిమగిరి కళాకారులు

సమీకృతం.. నిధుల గండం?

నిలిచిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం

- రోడ్ల పైనే కూరగాయల అమ్మకాలు

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవన నిర్మాణానికి నిధుల గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వంలో రూ.2.75 కోట్లతో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం నిధుల కొరతతో భవనం పిల్లర్ల వరకే పరిమితమైంది. కూరగాయలు, మాంసం అమ్మకాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని మార్కెట్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు మూడేళ్లు గడిచినా భవన నిర్మాణం పిల్లర్ల వద్దనే కునారిల్లుతుంది.

హుస్నాబాద్ పట్టణంలో సమీకృత మార్కెట్ భవనం లేకపోవడంతో చిరు వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడే రోడ్లపై కూరగాయలు అమ్ముతున్నారు. మల్లెచెట్టు చౌరస్తా, రామవరం రోడ్, బస్టాండ్ ఏరియా, అంబేద్కర్ చౌరస్తా ఇలా ప్రధాన కూడళ్లలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా రోడ్లపై అమ్మకాలు కొనసాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది.



అసంపూర్తిగా సమీకృత మార్కెట్ భవనం

ఇంకా పిల్లర్ల స్థాయిలోనే..

గత ప్రభుత్వంలో ఎంఏ అండ్ యూడీ గ్రాంట్ కింద ఈ భవన నిర్మాణానికి రూ.2.75 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధులను నిలిపివేసినట్లు సమాచారం. నిధులు విడుదల కాకపోవడంతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.



ప్రారంభానికి నోచుకోని రైతు బజార్

గత ప్రభుత్వంలో దాదాపు రూ.3.50 కోట్లతో రైతు బజార్‌కు శ్రీకారం చుట్టారు. ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్, పైరెండు అంతస్తుల్లో ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఈ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి దాదాపు 6 నెలలు గడుస్తుంది. ఈ భవనం అందుబాటులోకి తీసుకువస్తే తాత్కాలికంగా రోడ్లపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులను ఇక్కడికి రప్పించే అవకాశం ఉంది. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు అలంకార ప్రాయంగానే ఉంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.